క్లుప్తంగా

ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం జువాలజీ అధ్యాపకురాలు మణి విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో బ్లడ్ సర్క్యులేటరీ సిస్టమ్, హార్ట్, బ్లడ్ వెసల్స్ గురించి వివరించారు. వాటర్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్‌తో పాటు ఇంగ్లిష్ సబ్జెక్టులో ఇఫ్ కండీషన్ గురించి విద్యార్థులతో రాయించారు. అనంతరం తెలుగులో పద్యాలు, పాటలు పాడించారు. మనో ఉల్లాసాన్ని కలిగించే కథలు చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష నాగవల్లి దళార్చన



నగరంపాలెం: స్థానిక పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు శుక్రవారం మూడోవ రోజుకి చేరాయి. తెల్లవారుజామున 5.30కు ప్రభాత సేవతో మొదలై, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం శ్రీ వీరాంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళార్చన అత్యంత వైభవంగా జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పు రావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కోశాధికారి గ్రంధి కోటేశ్వరరావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణ రావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు, కాసుల వెంకటశివ ప్రసాద్, నాగం రామారావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష మల్లెల పూజ



నగరంపాలెం: స్థానిక నాజ్ కూడలిలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం పంచామృత స్నపన, లక్ష మల్లె పూజ నిర్వహించారు. జిల్లాలోని పలువురు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ పి. జయప్రకాష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు, శ్రీ హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షుడు వెంకట సుబ్బారావు, ఆలయ అర్చకుడు నరసింహాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సమాజం సభ్యులు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, వెంకటరమణ, సీహెచ్.రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా మేధ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట శివాలయంలో శ్రీమేధ దక్షిణామూర్తి మందిరంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామిని విశేష ద్రవ్యాలతో కన్నుల పండువగా అభిషేకించి, సుందరంగా అలంకరించారు. పుష్పార్చనలు, అష్టోత్తర శతనామావళి అర్చన, మంగళహారతులు ఇచ్చారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

ప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెల పూజ



చేబ్రోలు: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రోడ్ల విస్తరణ వేగవంతం చేయండి

పట్టణ ప్రణాళిక అధికారుల సమావేశంలో కమిషనర్



పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల విస్తరణ జరిగిన ప్రాంతాల్లో నిబంధనల మేరకు టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటీ అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు వసూళ్లు తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీపీల వారీగా ఈ నెలాఖరు నాటికి నూరు శాతం జరిగేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే వేగవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీ అశోక్ కుమార్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై అడ్డంకులు ఉంచితే కఠిన చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై అడ్డంకులు ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ సీఐ రామయ్య తెలిపారు. పేరేచర్ల, ఫిరంగిపురం గ్రామాల మధ్యలో నివాసితులకు శుక్రవారం ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రయాణించే సమయంలో కొందరు రైలు పట్టాలపై ఇనుప ముక్కలు, చిల్లర, రాళ్లు ఉంచడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. రైలు సమయానికి గమ్యం చేరుకోలేక పోతుందని చెప్పారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే రైల్వే చట్టం ప్రకారం చర్యలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. రైలు వచ్చే సమయంలో జీవాల్ని పట్టాలు దాటించరాదని, దీనివల్ల ప్రమాదాలు వాటిల్లుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐలు ఏడుకొండలు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన ఏఈఎస్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఈబీ శిక్షణ ఏఈఎస్ జయమౌనిక

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ను ఎస్ఈబీ (సెబ్) శిక్షణ సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) కె.జయమౌనిక శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. 2022 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన ఆమె ఏఈఎస్ శిక్షణలో భాగంగా గుంటూరు జిల్లాకు కేటాయించారు. కృష్ణాజిల్లాలోని బొంతపాడు ఆమె స్వగ్రామం. ఆమె తండ్రి కె.వెంకట్రావు కృష్ణా జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు.

పక్కాగా పంట నష్టం నమోదు: ఏడీఏ



వంగిపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: పంట నష్టం నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని గుంటూరు డివిజన్ ఏడీఏ జి. శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రత్తిపాడు మండలం వంగిపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటల్ని శుక్రవారం ఆయన ఏవో అరుణకుమారితో కలసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాలు సాగు చేశారు.. ఎంత పెట్టుబడులు పెట్టారు ? తదితర వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులపై ఎంతో సానుకూల దృక్పథంతో ఉందని చెప్పారు. పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేందుకు, పంట నష్టం నమోదుకు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నెల పదిహేను వరకు రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది పంట నష్టాన్ని నమోదు చేయనున్నారని చెప్పారు. నమోదు పూర్తయిన తరువాత 16వ తేదీ నుంచి 20 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించి, ఆర్బీకె స్థాయిలో చివరి జాబితాను సిద్ధం చేస్తామని వెల్లడించారు. గతంలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకున్న రైతుల్ని మాత్రమే పంట నష్టం కింద నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఏవో అరుణకుమారి మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి



గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్పీ రామారావు

అప్పాపురం(కాకుమాను): గ్రామంలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరికీ పనుల్ని కల్పిస్తున్నామని, కూలీలంతా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పొందుగుల ఆచారి తెలిపారు. మండలంలోని అప్పాపురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో జాబ్ కార్డులు కలిగిన ఎస్సీ,ఎస్టీల కుటుంబాలు ప్రతి రోజు పనులకు వెళ్లి కనీసం వేతనం పొందాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ కె.శరత్‌బాబు మాట్లాడుతూ గతేడాది గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించడంతో పాటు లోపాల్ని గుర్తిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డీఆర్పీలు రామారావు, రాజు, ఉపాధి హామీ ఏపీఓ సింగారావు, సిబ్బంది, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చలపతి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. లాం నందున్న కళాశాలలో శుక్రవారం యలమంచిలి ఫౌండేషన్, కాటూరి మెడికల్ కళాశాల, కాటూరి అర్బన్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి రోజు కనీసం ఒక గంటపాటు ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం, యోగా వంటి కార్యక్రమాల్ని చేయాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటే ఆస్తుల్ని కాపాడుకున్నట్లేనని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు కళాశాలలోని 550 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్ : నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సూపరింటెండెంట్లను నగర కమిషనర్ కీర్తి చేకూరి అంతర్గత బదిలీలు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.ఎన్.ప్రసాద్‌ను జీఎస్ డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్‌గా, రెవెన్యూ సెక్షన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఎం.పోలేశ్వరరావును టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్‌గా, ఉపాసెల్ పీఓ సాంబశివరావును ఆర్వో–1 ఇన్‌చార్జిగా, ఆర్వో–3 రవికుమార్‌ను ఆర్వో–2 సూపరింటెండెంట్‌గా, జీఎస్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ రెహమాన్‌ను ఆర్వో–3గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన కోసన శివయ్య (44) ఐదు సంవత్సరాల కిందట బసివిరెడ్డి వద్ద రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఇప్పటిదాకా వడ్డీ కింద రూ. 12లక్షలు చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా రూ. లక్ష కట్టాలని శివయ్యను బసివిరెడ్డి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. తన వద్ద డబ్బులు లేవని, కట్టలేని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని బాధితుడు లేఖ రాసి ఈ నెల 11వ తేదీ సాయంత్రం బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో పురుగులు మందు తాగాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వసంతరాయపురం 3వ లైనుకు చెందిన ఎం.కాళీ నాగ వంశీకి రాజమండ్రికి చెందిన రఘువర్మ పరిచయం అయ్యాడు. నాగవంశీ భార్యకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రఘువర్మ నమ్మించాడు. దీంతో అతడు రెండు దఫాలుగా రూ. 2.40లక్షలు చెల్లించాడు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడిగితే రఘువర్మ బెదిరిస్తుండటంతో బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మహిళ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. శివనాగరాజు కాలనీకి చెందిన పఠాన్ సుభాని భార్య అబ్జల్ మనీషా (28) ఇంటి యజమానుల సూటిపోటీ మాటలకు మనస్తాపం చెంది, గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మసీదు అభివృద్ధికి విరాళం

పెదనందిపాడు: మండలంలోని పాలపర్రులో మసీదు అభివృద్ధికి గ్రామస్తుడు మేరిగల మణి కుమార్ తన తల్లి సుశీల జ్ఞాపకార్థం రూ. 25,000ను అందజేశారు. శుక్రవారం ఉదయం ఆయన నగదును మసీదు పెద్దలకు అందించారు. ఆయన వెంట సర్పంచ్ అన్నలదాసు సునీత, గ్రామస్తులు ఉన్నారు.

సినీ నటి టీనా చౌదరికి సత్కారం



టీనా చౌదరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: వర్ధమాన సినీ నటి, కూచిపూడి నర్తకి మన్నె టీనా చౌదరికి జన్మస్థలి సత్కారం జరిగింది. స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని స్విమ్ అండ్ ఫన్ ఆడిటోరియంలో శుక్రవారం జెట్టి విజయశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు డాక్టర్ గిరిధర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ టీనా భారత ఉప రాష్ట్రపతి, మిజోరాం, కర్ణాటక, తమిళనాడు గవర్నర్ల ఎదుట తన నృత్య ప్రతిభను చాటి, వారి అభినందనలు అందుకున్నట్లు గుర్తుచేశారు. ఇంజినీరింగ్ చదువుతూ కూచిపూడి నృత్యంలోనూ చక్కని ప్రతిభను ప్రదర్శించిన టీనా చౌదరి తెనాలికి గర్వకారణమని విజయశేఖర్ పేర్కొన్నారు. సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ, ఉమాదేవి, ఎంపీటీసీ అమ్మిశెట్టి ఆదినారాయణ, మన్నే సత్యనారాయణ, రవి అనిల్, శ్రీనివాసరావు, అప్పారావు మాట్లాడారు. తొలుత చిన్నారులు గ్రీష్మ, తహసీన్ చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

శేకూరులో కుట్టు శిక్షణ ప్రారంభం



శేకూరు(చేబ్రోలు): మహిళల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి టైలరింగ్ చేయూత నిస్తుందని శేకూరు గ్రామ సర్పంచ్ ఎం. శ్యామల తెలిపారు. ప్రభు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలోని రెబ్బా వారి భవనంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలంతా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్టు చైర్మన్ రెబ్బా విక్టర్‌పాల్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా స్థానిక మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి వారి జీవనోపాధికి, స్వయం ఉపాధికి ఉపయోగపడే విధంగా ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ నాగలక్ష్మి, స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

తాజా పరిణామాల అధ్యయనం ఎంతో కీలకం



కరెంట్ అఫైర్స్ బోధిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్స్, గ్రూప్–1, 2 వంటి పోటీ పరీక్షల్లో భాగంగా తాజా పరిణామాల (కరెంట్ అఫైర్స్)ను ప్రతి రోజూ అధ్యయనం చేయడం ఎంతో కీలకమని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్), కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆయన రెంట్ అఫైర్స్‌ను బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంశాల్ని జాతీయ, అంతర్జాతీయంగా విభజించుకోవాలని సూచించారు. వివిధ దేశాల్లో జరుగుతున్న సంఘటనలు, అంతర్జాతీయ సంస్థల గురించి అధ్యయనం చేయాలని తెలిపారు. క్రీడలు, అవార్డులు, సైన్స్, టెక్నాలజీ, జాతీయ ఆర్థిక వ్యవస్థ, నియామకాలు, ప్రముఖ వ్యక్తులు తదితర అంశాలను గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఇందుకోసం దినపత్రికల్ని ప్రతి రోజూ క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో సన్ నిర్వాహకుడు కె. సాయి కుమార్, బాలు, అజయ్ పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళావతమ్మ

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్, డాక్టర్ ఎస్.కళావతమ్మ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవితం నర్సింగ్ వృత్తికి మార్గదర్శకమని చెప్పారు. నర్సింగ్ విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకుని, నిజాయతీ, నిబద్ధతతో వైద్య సేవలు అందించాలని సూచించారు. కరోనా సమయంలో నర్సింగ్ సిబ్బంది సేవల్ని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్. స్లీవమ్మ, కాలేజీ టీచింగ్ ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుభాని

పెదనందిపాడు: మండలంలోని నాగులపాడు రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సుభాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్ని రైతులంతా వినియోగించుకోవాలని తెలిపారు. ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాకు రూ.1962కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల్ని వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారన్నారు. వారి సూచనల మేరకు పంటను కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ జి. శ్రీనివాసరావు, ఏవో సుధారాణి, కాపు శ్రీను, కొనుగోలు ఇంచార్జి నాంచారయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



నడంపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని నడింపాలెంలో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు శుక్రవారం మజ్జిగ, మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పోతురాజు లక్ష్మీనారాయణ దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఆర్ఈజీఎస్ టీఏ జ్యోతి, మంద ప్రసాదరావు, కళ్లం పేరిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఏ మాట్లాడుతూ వేసవిలో కూలీల శ్రేయస్సు దృష్ట్యా మజ్జిగతో పాటు దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఏ కె. జ్యోతి పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

నెహ్రూనగర్: దళిత బహుజన నాయకుడు జెల్డి ఇశ్మాయేల్ బాబు రెండో వర్ధంతి సందర్భంగా అరండల్‌పేటలో డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్, రిటైర్డ్ ఎస్‌బీఐ బ్యాంక్ ఏజీఎం ఎస్. గణేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దేందుకు ఈ నైపుణ్య శిక్షణ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ముందుగా ఇశ్మాయేల్ బాబు రెండో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మేళం భాగ్యారావు, మేడిద బాబూరావు, భూపతి సునీల్‌కుమార్, పొందుగల ప్రకాష్, చంద్రానాయక్, నాయకులు పాల్గొన్నారు.

పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ నష్టపరిహారం: ఆర్డీవో



ఉప్పలపాడులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకరరెడ్డి

పెదకాకాని: పంట దెబ్బ తిన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి ప్రభాకరరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడులో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన జొన్న, మొక్కజొన్న పంటల్ని ఏవో పి. సంధ్యారాణితో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వర్షానికి దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని సూచించారు. కల్లాల్లో ఆరుతున్న సమయంలో పంట దెబ్బతిన్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏలకు సమాచారం అందించాలని చెప్పారు. పంట నష్టపోయిన రైతుల జాబితా ఈనెల 15లోగా తయారు చేసి, 16 నుంచి 20 వరకూ రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని రైతులకు చెప్పారు. అనంతరం మండలంలో అకాల వర్షాలకు జరిగిన పంట నష్టంపై అధికారులతో చర్చించారు. బాధిత రైతుల జాబితా వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. రత్నం, ఉప్పలపాడు వ్యవసాయ పరపతి సంఘం చైర్‌పర్సన్ శివాబత్తిన దయానంద్, సభ్యుడు పల్లెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత మహిళకు ఆర్థిక సాయం

తెనాలి: వైకుంఠపురం రోడ్డు వద్ద నివసిస్తున్న పఠాన్ మున్ని అనే మహిళకు తెనాలి రోటరీ క్లబ్ రూ.25,500 ఆర్థిక సాయం అందజేసింది. కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న మున్ని వైద్య చికిత్సకు సాయం కోసమని రోటరీ క్లబ్‌కు విజ్ఞప్తి చేసింది. క్లబ్ సభ్యులు అందించిన సహకారంతో నగదును శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్, జీవీ నారాయణ ఆమె నివాసంలో అందజేశారు.